'రెండో ఓటే' లెక్క..!

- మొదటి ప్రాధాన్యత ఓట్లతో ఫలితం తేలడం సందిగ్ధమే..!
- వరంగల్-ఖమ్మం- నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ఫలితంపై ఉత్కంఠ
- మూడు రౌండ్లలో కలిపి కాంగ్రెస్‌కు 1,06,234.. బిఆర్‌ఎస్‌కు 87,356
- చెల్లుబాటైన ఓట్లలో 51 శాతం మొదటి ప్రాధాన్యత ఓట్లు వస్తేనే విజేత
- లేదంటే నాలుగో రౌండ్ అనంతరం రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు ప్రారంభం

ఓట్లు లెక్కిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
వరంగల్- ఖమ్మం- నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ఫలితంపై ఉత్కంఠ నెలకొంది. విజేత తేలకపోవడంతో నల్లగొండలోని కౌంటింగ్ కేంద్రం అనిశెట్టి దుప్పలపల్లి గోదాములో రెండో రోజు గురువారం నాడు లెక్కింపు చేశారు. పోలై చెల్లిన ఓట్లలో 50 శాతానికి ఒక ఓటు అధికంగా సాధించిన అభ్యర్థిని విన్నర్‌గా ప్రకటిస్తారు. కానీ మొదటి ప్రాధాన్యత ఓట్లలో ఇప్పటి వరకు ఆ మొత్తాన్ని ఏ అభ్యర్థి సాధించేలా లేరు. ఈ నేపథ్యంలో రెండో ప్రాధాన్యత ఓటును పరిగణలోకి తీసుకొని లెక్కిస్తారు. మొత్తం ఈ ఎన్నికల్లో 52 మంది అభ్యర్థులు తలపడగా 3,36,013 ఓట్లు పోలయ్యాయి. వీటిని ఏడు రౌండ్లుగా విభజించి గురువారం కౌంటింగ్ చేపట్టారు. ఒక్కో రౌండ్‌లో 48 వేల ఓట్ల చొప్పున కౌంటింగ్ చేస్తున్నామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, నల్లగొండ కలెక్టర్ దాసరి హరిచందన తెలిపారు. బ్యాలెట్ పేపర్స్ బండిల్స్ కట్టి బుధవారం మధ్యాహ్నం 1 గంట నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టారు. ఒక్కో హాల్‌లో 24 టేబుల్స్ చొప్పున నాలుగు హాల్స్‌లో 96 టేబుల్స్ ఏర్పాటు చేశారు. ఒక్కో టేబుల్‌కు 500 ఓట్ల చొప్పున లెక్కిస్తున్నారు. అయినప్పటికీ గురువారం రాత్రి వరకు తొలి ప్రాధాన్యత ఓట్లలో మూడు రౌండ్ల ఫలితాలనే వెల్లడించారు. నాలుగో రౌండ్ లెక్కింపు ప్రక్రియ కొనసాగే అవకాశం ఉంది.

మొదటి ప్రాధాన్యతలో తేలడం కష్టమే..!

ఇప్పటి వరకు వెలువడిన ఫలితాలను బట్టి చూస్తే మొదటి ప్రాధాన్యత ఓట్లతో విజేత తేలడం దాదాపు కష్టంగానే ఉంది. మొదటి ప్రాధాన్యత ఓట్లలో కాంగ్రెస్, బిఆర్‌ఎస్ అభ్యర్థులు పోటాపోటీగా తలపడుతున్నారు. మూడు రౌండ్లలో కలిపి కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్‌కుమార్‌కు 1,06,234 ఓట్లు రాగా తన సమీప ప్రత్యర్థి, బిఆర్‌ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డికి 87,356 ఓట్లు వచ్చాయి. బిజెపి అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డికి 34,516 ఓట్లు లభించాయి. స్వతంత్ర అభ్యర్థి అశోక్‌కుమార్‌కు 27,493 ఓట్లు పోలయ్యాయి. వీటిలో మొదటి రౌండ్‌లో.. మల్లన్నకు 36,210 ఓట్లు రాగా రాకేశ్‌రెడ్డికి 28,540, ప్రేమేందర్‌రెడ్డికి 11,395 ఓట్లు లభించాయి. మల్లన్న ఈ రౌండ్‌లో 7,670 ఓట్ల మెజార్టీ సాధించారు. మరో 7,728 ఓట్లు చెల్లలేదు. రెండో రౌండ్ పూర్తయ్యే సమయానికి కాంగ్రెస్‌కు 70,785 ఓట్లు రాగా బిఆర్‌ఎస్ 56,114, బిజెపికి 24,239 ఓట్లు లభించాయి. కాంగ్రెస్ 14,671 ఓట్ల లీడ్‌లోకి వెళ్లింది. మూడో రౌండ్ లెక్కింపు పూర్తయ్యేనాటికి కాంగ్రెస్‌కు 1,06,234, బీఆర్‌ఎస్‌కు 87,356, బిజెపికి 34,516, అశోక్‌కుమార్‌కు 27,493 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ 18,878 ఓట్ల లీడ్‌లోకి చేరింది. మూడు రౌండ్లలో 2.88 లక్షల ఓట్లు లెక్కించారు. మూడింటిలో కలిపి 23,784 ఓట్లు చెల్లలేదు. నాలుగో రౌండ్‌లో 48,013 ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టారు. ఈ రౌండ్ ముగిసే సరికి మొదటి ప్రాధాన్యత ఓట్లలో 50శాతానికి పైగా ఎవరైనా సాధిస్తే విజేతగా ప్రకటిస్తారు. లేదంటే రాత్రి 9 గంటల తర్వాత రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు ప్రక్రియ మొదలవుతుంది. గత ఎన్నికల తరహాలోనే ఈ ఎలక్షన్స్ ఫలితం తేలడానికి నాలుగు రోజులు పట్టవచ్చని కౌంటింగ్ అధికారులు చర్చించుకుంటున్నారు.

తొలి ప్రాధాన్యత ఓట్లతో విజేత తేలడం కష్టమే..

నాలుగో రౌండ్ పూర్తయ్యాక చెల్లుబాటైన ఓట్లలో సగానికి ఎక్కువ ఎవరికీ రాకపోతే రెండో ప్రాధాన్యత ఓట్లను లెక్కించాల్సి ఉంటుంది. మొదటి ప్రాధాన్యతలో ఏ ఒక్కరికీ గెలుపు కోటాకు సరిపడా ఓట్లు వచ్చే అవకాశం లేదు. దాదాపు 1.60 లక్షలకు పైగా మొదటి ప్రాధాన్యత ఓట్లు సాధిస్తేనే విజేతలుగా నిలిచే అవకాశం ఉంది. ఇప్పటి వరకు తీన్మార్ మల్లన్న ఒక్కరే లక్ష ఓట్లకు పైగా 1,06,234 సాధించారు. నాలుగో రౌండ్‌లో 48,013 ఓట్లు ఉన్నాయి. వీటిలో 30వేల ఓట్లు మల్లన్న సాధించినా మేజిక్ నంబర్ ఓట్లను అధిగమించటం కష్టమే. కాబట్టి రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు అనివార్యంగా కనిపిస్తోంది.

రెండో ఓటుకు పోతే లాభనష్టాలపై బేరీజు..

రెండో ప్రాధాన్యత ఓట్లను లెక్కించక తప్పనిసరి పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో పార్టీలు, అభ్యర్థులు లెక్కలు వేసుకుంటున్నారు. రెండో ప్రాధాన్యత ఓట్లలోనూ తమకే ఎక్కువగా లభిస్తాయని కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న విశ్వాసంతో ఉండగా.. బిఆర్‌ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి సైతం అంతే నమ్మకంతో ఉన్నారు. బిఆర్‌ఎస్, బిజెపి, ఇతరులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసిన వారు రెండో ప్రాధాన్యత తనకే వేసిఉంటారని కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న భావిస్తున్నారు. కాంగ్రెస్, బిజెపిలకు తొలి ప్రాధాన్యం ఓటు వేసినవారిలో ఎక్కువ మంది రెండో ప్రాధాన్యత ఓటు బిఆర్‌ఎస్‌కే వేశారని ఆ పార్టీ శ్రేణులు చెబుతున్నాయి. గతంలో లాగే ఎలిమినేషన్ ప్రక్రియ వరకు కౌంటింగ్ చేరడం ఖాయంగా కనిపిస్తోంది. దీన్ని బట్టి ఫలితం శుక్రవారం లేదా శనివారం వెలువడే చాన్స్ ఉంది.

జస్టిస్ ఘోష్ రాక

- సాగునీటిశాఖ అధికారులతో భేటీ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో
కాళేశ్వరం ప్రాజెక్టు జ్యూడిషియల్ విచారణ కమిషన్ చైర్మన్ జస్టిస్ పినాకిని చంద్రఘోష్ గురువారం హైదరాబాద్ చేరుకున్నారు. కోల్‌కతా నుంచి మధ్యాహ్నం రెండు గంటలకు వచ్చిన ఆయన, నేరుగా హోటల్ తాజ్‌కృష్ణాలో చేరుకున్నారు. అక్కడే తొలుత సాగునీటి పారుదల శాఖ ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్‌జీవన్ పాటిల్‌తో భేటి అయ్యారు. అనంతరం కమిషన్ కార్యాలయానికి వచ్చి అధికారులతో కొద్దిసేపు సమావేశమయ్యారు. ఇప్పటి వరకు జరిగిన జ్యూడిషియల్ కమిషన్ వ్యవహారాలను సమీక్ష చేశారు. శుక్రవారం అన్నారం బ్యారేజీ పరిశీలనకు వెళుతున్నారు. శనివారం సుందిళ్ల బ్యారేజీని చూస్తారు. అక్కడి నుంచి ఆ సాయంత్రం నేరుగా నగరానికి చేరుకుంటారు. ఆదివారం నుంచి పూర్తిగా బూర్గుల రామకృష్ణారావు భవన్‌లోని కమిషన్ కార్యాలయయంలోనే ఉంటూ అధికారిక పనులు చూసుకోనున్నారు. ఈ నెలాఖరులోగా విచారణ పూర్తిచేయాలని సర్కారు ఆదేశించిన తరుణంలో ఆ దిశగా ఆయన ప్రయత్నాలు చేస్తున్నట్టు సమాచారం. సాధ్యమైనంత వేగంగా నివేదిక తయారుచేసి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి గానీ, సిఎం రేవంత్‌రెడ్డికి గాని అందించే అవకాశం ఉందని తెలిసింది.

సేవింగ్ ఖాతాలపై బీమాకు ప్రాధాన్యం

- ఉజ్జీవన్ ఎస్‌ఎఫ్‌బి వెల్లడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
మెట్రోలు, నాన్-మెట్రోలు రెండింటిలోనూ బ్యాంకింగ్ కస్టమర్‌లు తమ ప్రీమియం సేవింగ్స్ ఖాతాలలో భాగంగా కాంప్లిమెంటరీ ఆఫర్‌లు, విలువ ఆధారిత సేవలను ఎక్కువగా ఆశిస్తున్నారని ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ అధ్యయనంలో తేలింది. ఈ సంస్థ నిర్వహించిన సర్వేలో మెట్రోయేతర కస్టమర్లలో 42 శాతం మంది ప్రమాదవశాత్తు రూ.10 లక్షల బీమా కవరేజీని అందించే ప్రీమియం సేవింగ్స్ ఖాతాలపై ఆసక్తి చూపు తున్నారన్నారు. దీనికి విరుద్ధంగా 67 శాతం మెట్రో కస్టమర్‌లు షాపింగ్, ప్రయాణానికి సంబంధించిన ఆఫర్‌లపై ఆసక్తి చూపు తున్నారు. ఉజ్జీవన్ ఎస్‌ఎఫ్‌బి 400కు పైగా శాఖలలో ఈ సర్వేను చేపట్టినట్లు పేర్కొంది.

ఒలింపియాడ్ పరీక్షలో హైదరాబాద్ విద్యార్థులకు ర్యాంకులు

హైదరాబాద్ బ్యూరో : ఎస్‌ఎఫ్‌ఒ ఒలింపియాడ్ పరీక్షలో హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు టాప్ ర్యాంక్‌లు సాధించారు. ఫ్యూచర్ కిడ్స్ స్కూల్ ఐదో తరగతి విద్యార్థి ముంజులూరి సాత్విక్ నేషనల్ కామర్స్ ఒలింపియడ్‌లో అంతర్జాతీయ రెండవ ర్యాంక్ సాధించి రజత పతకం మెరిట్ సర్టిఫికేట్ సంపాదించాడు. నాచారం ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఎనిమిదో తరగతి విద్యార్థి శుభాయు బెనర్జీ, 8వతరగతి నేషనల్ కామర్స్‌లో రజత పతకం మెరిట్ సర్టిఫికేట్‌ను అందుకున్నారు. 2023-24 సంవత్సరానికి గాను ఎస్ఒఎఫ్ ఒలింపియాడ్‌లో హైదరాబాద్‌కు చెందిన 2,34,071 మంది విద్యార్థులతో సహా 70 దేశాలలో సుమారు లక్షలాది మంది విద్యార్థులు పాల్గొన్నారని నిర్వాహకులు తెలిపారు.

వెల్‌స్పన్‌లో పర్యావరణ కార్యక్రమం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని వెల్‌స్పన్ హైదరాబాద్ మొక్కలు పర్యావరణాన్ని కాపాడుకునేందుకు తమ తపనను చూపుతున్న ప్రతి ఉద్యోగికి కృతజ్ఞతలని ఆ కంపెనీ తెలిపింది. పర్యావరణ సస్టెయినబిలిటీ, పర్యావరణ సారథ్యం పట్ల తమ నిబద్ధతను వెల్‌స్పన్ ప్రదర్శిస్తుందని పేర్కొంది. మన భూగోళాన్ని రక్షించుకోవడానికి చేపట్టే సమ్మిళిత కార్యక్రమాల ప్రభావాన్ని ఆ కంపెనీ ఉద్యోగులకు వివరించింది.

సిఎం రిలీఫ్ ఫండ్ పునరుద్ధరణ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో
రాష్ట్రంలో ఎన్నికల కోడ్ ముగిసిన నేపథ్యంలో సీఎం రిలీఫ్ ఫండ్‌ను పునరుద్ధరించాలని సిఎం రేవంత్‌రెడ్డి గురువారం ఆదేశించారు. నూతన ప్రభుత్వం ఏర్పాటు తర్వాత ఎలక్షన్‌కోడ్ కారణంగా వేలాది సీఎంఆర్‌ఎఫ్ దరఖాస్తులు నిలిచిపోయాయని తెలిపారు. గత ప్రభుత్వం జారీ చేసి మధ్యలో నిలిపివేసిన సుమారు 60 వేల చెక్కులను లబ్ధిదారులకు ఇవ్వాలని ఆయన ఆదేశించారు. ఈ క్రమంలో ఒకట్రెండు రోజుల్లో లబ్ధిదారులకు ప్రభుత్వం చెక్కులు పంపిణీ చేయనున్నది.

IN THE COURT OF THE 3rd ADDITIONAL JUNIOR CIVIL JUDGE: KADAPA
I.A.No. 859 of 2020 in O.S.No.845 of 2020
Between:
Kadasani Siva Sankar Reddy, Son of Late Kadasani Chinna Veera Reddy, aged about 63 years, Hindu, Business, resident of Todupadu, Markapuram Mandal, Gajjala Konda, Prakasam District, Andhra Pradesh. **...Petitioner/Plaintiff**
And
2. Kadasani Sudharshan Reddy, Son of Late Ramachandra Reddy, aged about 55 years, Hindu, Advocate, resident of D.No. 12-10-587-95/5, Sithaphala Mandi, Secunderabad.
...Respondent/Defendant
ప్రతివాది రెస్పాండెంటు 2కు నోటీసు
ఇందు మూలంగా తెలియజేయడమేమనగా ప్రతివాది హాజరు నిమిత్తము తేదీ.02-07-2024 ఉదయం. 10.30 గంటలకు పై కోర్టు నందు వాయిదా కలదు. మీ హాజరు కొరకు వాయిదా వున్నది. కావున స్వయంగా కాని, వకీలు ద్వారా కాని హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకోవలయును లేని యెడల మీ పరోక్షముగా తీర్మానించబడునని తెలియజేయడమైనది.
//రాజశ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు//
యం. సురేష్ కుమార్
అడ్వకేటు, కడప
సెల్ : 9440673990

IN THE COURT OF THE 3rd ADDITIONAL JUNIOR CIVIL JUDGE: KADAPA
O.S. No. 845 of 2020
Between:
Kadasani Siva Sankar Reddy, Son of Late Kadasani Chinna Veera Reddy, aged about 63 years, Hindu, Business, resident of Todupadu, Markapuram Mandal, Gajjala Konda, Prakasam District, Andhra Pradesh. **...Plaintiff**
And
2. Kadasani Sudharshan Reddy, Son of Late Ramachandra Reddy, aged about 55 years, Hindu, Advocate, resident of D.No. 12-10-587-95/5, Sithaphala Mandi, Secunderabad.
...Defendant
ప్రతివాది ప్రతివాది 2కు నోటీసు
ఇందు మూలంగా తెలియజేయడమేమనగా ప్రతివాది హాజరు నిమిత్తము తేదీ.02-07-2024 ఉదయం. 10.30 గంటలకు పై కోర్టు నందు వాయిదా కలదు. మీ హాజరు కొరకు వాయిదా వున్నది. కావున స్వయంగా కాని, వకీలు ద్వారా కాని హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకోవలయును లేని యెడల మీ పరోక్షముగా తీర్మానించబడునని తెలియజేయడమైనది.
//రాజశ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు//
యం. సురేష్ కుమార్
అడ్వకేటు, కడప
సెల్ : 9440673990

BEFORE THE MOTOR ACCIDENTS CLAIM TRIBUNAL CUM CHIEF JUDGE, CITY CIVIL COURT, AT HYDERABAD
MV.OP. No. 987 OF 2023
Between:
S. Ishaan & another
...Petitioners
AND
Ahmed Hussain & others
...Respondents
To,
Ahmed Hussain, S/o. Maqbool Hussain, aged Major, Occ.: Business, R/o. 365/A, Ram Reddy Nagar, Quthbullapur, R.R. District.
...Respondent No.1
Whereas the Petitioner herein has instituted MVOP for seeking compensation on the account of accident against you. You are hereby summoned to appear in the court of Hon'ble Chief Judge, City Civil Court at Hyderabad, in person or through Advocate duly instructed, on 12-06-2024 at 10:30 a.m., failing which the matter will be heard and decided ex-parte.
//By order of the Hon'ble Court//
G. GOWRI SHANKER
Advocate
 # 16-2-147/38, Anand Nagar,
Behind Chermas, Signature Bar,
Malakpet, Hyderabad.
Cell No.9246533756

నిమ్స్‌లో మంత్రి పొన్నంకు వైద్యపరీక్షలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ వైద్య పరీక్షలు చేయించుకున్నారు. గురువారం పంజగుట్టలోని నిమ్స్ ఆస్పత్రిని మంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా కార్డియాలజీ విభాగం సీనియర్ వైద్యులు ప్రొఫెసర్ సాయిసతీష్, జనరల్ మెడిసిన్ వైద్యులు ప్రొఫెసర్ నావెల్ చంద్ర, పల్మనాలజీ సీనియర్ వైద్యులు పరంజ్యోతిల ప్రత్యేక పర్యవేక్షణలో ఆయనకు సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం మంత్రి ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ, ప్రభుత్వ పథకాల ద్వారా రోగులకు అందిస్తున్న సేవల గురించి ఆరా తీశారు. రోగులకు ప్రభుత్వ నిమ్స్‌లో అందిస్తున్న సేవల గురించి నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప, మెడికల్ సూపరింటెండెంట్ నిమ్మ సత్యనారాయణ మంత్రికి వివరించారు. పేద రోగులకు అందుతున్న సేవలపై పొన్నం సంతృప్తిని వ్యక్తం చేశారు.

గ్రామీణ రోడ్లకు మరమ్మతులు

- పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు, ఇతర పరిస్థితుల నేపథ్యంలో దెబ్బతిన్న గ్రామీణ రోడ్లకు వెంటనే మరమ్మతులు చేస్తామని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క చెప్పారు. సిఆర్‌ఆర్, ఎంఆర్‌ఆర్ నిధులను ఉపయోగించి గ్రామీణా రహదారుల అభివద్ధి కోసం కషి చేయాలని అధికారులను ఆదేశించారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖపై డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో గురువారం మంత్రి సమీక్ష చేశారు. ఈ సందర్భ గ్రామీణ రహదారులు, వాటి పరిస్థితిపై ఆరా తీశారు. మరమ్మతులు, నిధులు, ఇతర అంశాలపై అధికారులతో చర్చించారు. పంచాయతీలు, స్థానిక సంస్థలలో వివిధ అభివద్ధి పనుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. అలాగే మౌలిక సదుపాయాల కోసం కొత్త పనులకు ప్రతిపాదనలు పంపాలని కోరారు. పెండింగ్ పనుల్లో నాణ్యత పెంచే విధంగా త్వరితగతిన చర్యలు తీసుకుని పూర్తి చేయాలని చెప్పారు. నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో పంచాయితీ రాజ్ ఇంజనీర్ ఇన్ చీఫ్ కనకరత్నం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఉమానేహాను సత్కరిస్తున్న కళాకారులు

బాలు పాట బాపు బృందం నోట రసభరితం

ప్రజాశక్తి కల్చరల్
విఖ్యాత గాయకుడు బాలసుబ్రహ్మణ్యం జయంతి పురస్కరించుకొని ప్రముఖ సాంస్కృతిక సేవా సంస్థ మనీషా కల్చరల్ ఆర్గనైజేషన్ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో బాలు పాట మా నోట అనే శీర్షికన రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో బాలుకు స్వర నీరాజనం కార్యక్రమం నిర్వహించారు. మధు బాపు శాస్త్రి సహగాయకులు శ్రీనివాస్, ఆనంద రెడ్డి, నేహా, శ్రీదేవి, ప్రియ దర్శిని, అపర్ణ, వేలూరి రామకష్ణ తదితరులతో కలసి పలు పాటలు రస భరితంగా ఆలపించారు. ఈ సందర్భంలో అతిథులుగా సౌజన్య దాతలు వెంకట్ గుప్త, సుధీర్ మహావది తదితరులు పాల్గొని ప్రముఖ గీత కర్త స్వర కర్త గాయకుడు గంగా పుత్ర నర్సింగ్ రావును నేపథ్య గాయనీ ఉమా నేహాను ఉత్తమ గాయకులు పురస్కారంతో సత్కరించారు సంస్థ నిర్వాహకుడు మధు బాపు శాస్త్రి మాట్లాడుతూ తాను వేదికల పై పాటలు పాడడం ఆరంభించి ముప్పై ఏళ్లు పూర్తయిందని, గతంలో ఇరవై నాలుగు గంటలు నిర్విరామంగా బాలు పాటలు పాడీ రికార్డ్ కెక్కనని గాయకులు బాలు, సుశీల తనను అభినందించారని గుర్తు చేసుకున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ బోధన

- రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ దేవసేన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవం ఉన్న ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్యా బోధన చేయిస్తున్నామని రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ దేవసేన అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా గురువారం హైదరాబాద్ నల్లగుట్టలోని ప్రభుత్వ పాఠశాలలో ఆర్జెడి విజయలక్ష్మి, డిఇఒ రోషిణి తదితర అధికారులతో కలిసి ఆమె సందర్శించారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. ప్రయివేటు పాఠశాలల్లో అర్హత కలిగిన ఉపాధ్యాయులు తక్కువని, అనవసరంగా ఫీజుల రూపంలో డబ్బు పోగొట్టుకోకుండా ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. అలాగే, అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో మూత్రశాలలు, మంచినీళ్లు, విద్యుత్ తదితర సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. ప్రయివేటు పాఠశాలల నుంచి ఎందుకు ప్రభుత్వ పాఠశాలల్లోకి పిల్లలను తీసుకొచ్చారని కమిషనర్ కొంత మంది తల్లిదండ్రులను అడగ్గా.. ప్రయివేటులో ఫీజులు ఎక్కువగా ఉండడంతో ఇక్కడ చేర్పిస్తున్నామని వారు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పుడు బోధన కూడా బాగుంటుందన్నారు. అలాగే కొంత మంది విద్యార్థులతో కమిషనర్ మాట్లాడి వివిధ ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. 1వ తరగతికి చెందిన హర్షిత అనే విద్యార్థిని 19వ టేబుల్ చెప్పడంతో ఆమె ఆశ్చర్యంవ్యక్తం చేశారు. ప్రధానోపాధ్యాయులు సిహెచ్ శౌరిని అభినందించారు. బడిబాట కార్యక్రమంలో బాగంగా ఇంటింటికీ తిరిగి విద్యార్థుల సంఖ్యను పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులూ భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఐఒఎస్ సుమన్, డిప్యూటీ ఇఒ శ్రీధర్, హైస్కూల్ హెచ్ఎం స్వరూప తదితరులు పాల్గొన్నారు.

బడిబాట కార్యక్రమంలో అవగాహన కల్పిస్తున్న దేవసేన

తల్లిదండ్రుల సంస్మరణ గొప్ప సంస్కారం

ప్రజాశక్తి కల్చరల్
బ్రతికి ఉన్నప్పుడే వృద్ధాశ్రమాలకు కన్న వారిని పంపే పిల్లలు వున్న ఈ కాలంలో తల్లితండ్రులను సంస్మరిస్తూ ప్రతి ఏటా వారి పేరిట కార్యక్రమాలు నిర్వహించటం గొప్ప సంస్కారం అని సివిల్ సర్వీస్ విశ్రాంత ఉన్నత అధికారి డాక్టర్ కె వి రమణ అన్నారు. వాసా ఫౌండేషన్ నిర్వహణలో శ్రీ త్యాగరాయ గాన సభ ప్రధాన వేదికపై డాక్టర్ వాసా ప్రభావతి శాస్త్రి జయంతి నిర్వహించారు. ముఖ్య అతిథిగా డాక్టర్ రమణ పాల్గొని ఆచార్య ముదిగొండ శివ ప్రసాద్‌కు వాసా ప్రభావతి జీవిత సాఫల్య ప్రతిభా పురస్కారంతో ప్రొఫెసర్ కొలవెన్ను మలయవాసినికి వాసా ప్రభావతి గురు పురస్కారంతో సత్కరించి ఒకొక్కరికి పాతిక వేల నగదు సంస్థ పక్షాన బహుకరించి మాట్లాడారు. వాసా ప్రభావతి నవల కథ వ్యాసం నాటకం వంటి ప్రక్రియలలో సిద్ధ హస్తురాలని గుర్తు చేశారు. ప్రభావతి నాయకత్వ లక్షణాలు కల రచయిత్రి అన్నారు. ఆమె పేరిట సత్కారం పొందిన ముదిగొండ శివప్రసాద్ చారిత్రక నవలలు రాయడంలో ఆయనకు ఆయనే సాటి అన్నారు. మలయవాసిని బహుగ్రంథ కర్త అని, ఆమె రచనలన్నీ విజ్ఞాన సంపద అన్నారు. అధ్యక్షత వహించిన ప్రముఖ సాహితవేత్త డాక్టర్ వోలేటి పార్వతీశం మాట్లాడుతూ విఖ్యాత సాహితీవేత్త పింగళి లక్ష్మీ కాంతం రచనను గ్రంథ రూపంలో వెలువరించిన మలయ వాసిని, పరిశోధన రచనలో ప్రసిద్ధుడు ముదిగొండకు వాసా పురస్కారం బహుకరించడం సముచితంగా వుందన్నారు. వాసా ప్రభావతి విశేష పరిశోధకురాలు అని ఆమె రచించిన భారత స్వాతంత్ర సమరంలో మహిళల పాత్ర పరిశోధక విద్యార్థులుకు ఉపయుక్తం అన్నారు. వేదికపై గుడిపాటి ,పొత్తూరి సుబ్బారావు, డాక్టర్ వాణీ బండారం శైలజ మిత్ర తదితరులు పాల్గొనగా ప్రభావతి కుమారుడు ప్రకాష్, కుమార్తె మీనాక్షి కార్యక్రమాన్ని నిర్వహించగా కిన్నెర రఘురాం వ్యాఖ్యానం పర్యవేక్షణ చేశారు.

9న గ్రూప్-1 ప్రిలిమ్స్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

- 897 పరీక్షా కేంద్రాల ఏర్పాటు
- 4.03 లక్షల మంది అభ్యర్థుల దరఖాస్తు
- బడి పిల్లలకు యూనిఫారాలు పంపిణీ చేయాలి
- రైతులకు సరిపడా విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలి
- కలెక్టర్లు, ఎస్‌పిలకు సిఎస్ శాంతికుమారి ఆదేశం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో
ఈనెల 9న తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టిజిపిఎస్‌సి) నిర్వహించే గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లాల కలెక్టర్లు, ఎస్‌పిలను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సిఎస్) శాంతికుమారి ఆదేశించారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సచివాలయంలో ఆమె గురువారం జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. రాష్ట్రంలో విత్తనాలు, ఎరువుల సరఫరా, మిషన్ భగీరథ, గ్రామాల్లో ఇంటింటి సర్వే, జిల్లాల్లో పాఠశాలలకు యూనిఫారాల పంపిణీ తదితర అంశాలను సీఎస్ ప్రస్తావించారు. రాష్ట్రంలో గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షను సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు టీజీపీఎస్సీ చైర్మెన్ మహేందర్ రెడ్డి చెప్పారు. 31 జిల్లాల్లోని 897 పరీక్షా కేంద్రాల్లో జరిగే ఈ పరీక్షకు 4.03 లక్షల మంది విద్యార్థులు హాజరవుతారని వివరించారు. పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు జిల్లా అదనపు కలెక్టర్లతోపాటు ఒక పోలీసు ఉన్నతాధికారిని కూడా నోడల్ ఆఫీసర్‌గా నియమించామని అన్నారు. ప్రతి 20 కేంద్రాలకు ఒక రీజినల్ కోఆర్డినేటర్‌ను కూడా నియమించామన్నారు. బయోమెట్రిక్ హాజరు కోసం ఇన్విజిలేటర్లకు శిక్షణ ఇచ్చేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవడంతోపాటు ఏదైనా సమస్య తలెత్తితే తగిన సంఖ్యలో బయోమెట్రిక్ పరికరాలను కూడా అందుబాటులో ఉంచామని వివరించారు. జిల్లా కలెక్టర్లకు కూడా పరీక్షల ఏర్పాట్లపై తగు ఆదేశాలు జారీ చేశామనీ, చీఫ్ సూపరింటెండెంట్లు, ఇన్విజిలేటర్లు, ఇతర సిబ్బందికి శిక్షణ కూడా పూర్తయిందని సిఎస్ చెప్పారు. గ్రూప్-1 పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా పరిస్థితిని నిశితంగా పరిశీలించేందుకు జిల్లావ్యాప్తంగా పోలీసు, ఇతర అధికారులతో సంయుక్త సమావేశం ఏర్పాటు చేయాలని కలెక్టర్లను ఆమె ఆదేశించారు. లబ్లాక్ మార్కెటింగ్, విత్తనాల నిల్వలను అరికట్టడంలో సమర్థవంతమైన చర్యలు తీసుకున్నందుకు జిల్లాల కలెక్టర్లను సీఎస్ అభినందించారు. రాబోయే మూడు వారాల పాటు ఇదే నిఘా కొనసాగించాలని కోరారు. రాష్ట్రంలో సరిపడా విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయని అన్నారు. ప్యాక్ చేసిన విత్తనాలను కొనుగోలు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. రైతులు సీజన్ ముగిసే వరకు విత్తనాలు కొనుగోలు చేసిన బిల్లులను భద్ర పరుచుకునేలా చూడాలనీ, తద్వారా అవసరమైతే నష్ట పరిహారం క్లెయిమ్ చేసుకునేందుకు వీలవుతుందని అన్నారు. కేంద్ర గోడౌన్ల నుంచి మండల స్థాయి వరకు ఎరువుల తరలింపును పర్యవేక్షించి సక్రమంగా అందేలా చూడాలని కలెక్టర్లను ఆమె ఆదేశించారు. పోలీసు, రెవెన్యూ, వ్యవసాయ శాఖలు సమన్వయంతో పనిచేసి పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలనీ, దుకాణాల్లో నిల్వలు అందుబాటులో ఉండేలా చూడాలని కోరారు.

గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్ ఉందా లేదా అనే విషయాన్ని నిర్ణీత గడువులోగా సర్వే చేయాలని కలెక్టర్లను సిఎస్ ఆదేశించారు. ఈనెల 12న పాఠశాలలు ప్రారంభించే నాటికి ఒక జత యూనిఫారం విద్యార్థులకు అందేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ శాఖ ముఖ్యకార్యదర్శి దానకిశోర్, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ అనితా రామచంద్రన్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ దివ్య, టిజిపిఎస్‌సి కార్యదర్శి నవీన్ నికోలస్, ఇతర అధికారులు పాల్గొన్నారు. డిజిపి రవిగుప్తా, ఇతర పోలీసు అధికారులు పోలీస్ అకాడమి నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

बैंक ऑफ महाराष्ट्र
Bank of Maharashtra
ONE FAMILY ONE BANK
బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర
జోనల్ ఆఫీసు, విజయవాడ, 1వ అంతస్తు, ఇన్ఫినిటీ ప్లాజా, డోర్ నం.: 59ఎ-21-7/3, హైస్కూల్ రోడ్, పటమట, విజయవాడ, ఆం.ప్ర.-520007, టెలి: 0866-2431225
AX76/Vijayawada/SARFAESI/2024-25 01/06/2024
(రూలు 8(1) స్వాధీనతా ప్రకటన
ఏదైతే, క్రింది సంతకందారు, **బ్యాంకు ఆఫ్ మహారాష్ట్ర, చీఫ్ మేనేజర్, విజయవాడ జోన్** యొక్క అధీకృత అధికారిగా, ది సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్సియల్ అసెట్స్ & ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు ది సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8తో చదువబడే సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, **తేది: 26.09.2023 నాటి** డిమాండ్ నోటీసు జారీచేసి, దిగువ రుణగ్రహీతలు & హామీదారులు **1. మెసర్స్ వీరమ్మ తల్లి ఫుడ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ (రుణగ్రహీత),** 3వ అంతస్తు, ఫ్లాట్ నం.301, బ్లాక్-ఎ, అభ్యాస్ లేక్ వీవ్ రెసిడెన్సీ, నిజాంపేట్ గ్రామం, హైదరాబాద్-500090, తెలంగాణ. **2. శ్రీ గుజాల గణేష్ విష్ణు కుమార్ (డైరెక్టర్) (రుణగ్రహీత& హామీదారు),** 301, ప్లాట్ నం.353, వీధి నం.08, కాకతీయ హిల్స్, మాధాపూర్, హైదరాబాద్-500081 మరియు డోర్ నం. 40-3/1-54, సత్యనారాయణ వీధి, ఫోర్చ్యూన్ మురళి పార్క్ హోటల్ ఎదురుగా, విజయవాడ-520010. **3. శ్రీ కొక్కిరాల సత్యప్రసాద్ (డైరెక్టర్)(రుణగ్రహీత& హామీదారు),** 301, ఫ్లాట్ నం.353, వీధి నం.08, కాకతీయ హిల్స్, మాధాపూర్, హైదరాబాద్-500081 మరియు ఫ్లాట్ నం.301, ఎ-బ్లాక్, అన్వాయాస్ లేక్ వీవ్ రెసిడెన్సీ, నిజాంపేట్-500090. **4.శ్రీ సుబ్బారావు గాజుల (హామీదారు),** డోర్ నం. 40-3/1-54, సత్యనారాయణ వీధి, ఫోర్చ్యూన్ మురళి పార్క్ హోటల్ ఎదురుగా, విజయవాడ-520010, అనువారిని సదరు నోటీసు స్వీకరణ తేది నుండి 60 రోజుల్లోగా సదరు పేర్కొనబడిన **రూ.6,54,54,722.51/- (రూపాయలు ఆరు కోట్ల యాభై నాలుగు లక్షల యాభై నాలుగు వేల ఏడు వందల ఇరువై రెండు మరియు యాభై ఒక పైసలు మాత్రమే)** ప్లస్ 26.09.2023 వరకు వర్తించినట్లుగా అమలుచేయని వడ్డీ రూ.14,74,668/- (రూపాయలు పద్నాలుగు లక్షల డెబ్బై నాలుగు వేల ఆరు వందల అరవై ఎనిమిది మాత్రమే) మరియు దానిపై 27.09.2023 నుండి వర్తించుతూ 11.80%తో (2% పెనల్ వడ్డీ మినహాయించి) తదుపరి వడ్డీ ప్లస్ ఖర్చులు& ఇతర వ్యయాలు మొ॥వాటిని తిరిగి చెల్లించవలసిందిగా కోరబడుచున్నది. నోటీసును అక్నాలెడ్జిమెంట్ ద్యూ గల రిజిస్టర్డు పోస్టు మరియు స్పీడ్ పోస్టు ద్వారా పంపబడినది. రుణగ్రహీత/తాకట్టుదారులు/హామీదారులు మొత్తాలను తిరిగి చెల్లించుటలో విఫలం చెందియున్నందున, ఇందుమూలంగా రుణగ్రహీతలు, హామీదారులు మరియు సర్వజనులకు ప్రకటన ఇవ్వడమేమనగా, క్రింది సంతకందారు సదరు రూల్స్ యొక్క రూల్ 8తో చదువబడే సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అతనికి/ఆమెకు సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, **01.06.2024న** ఇందు దిగువ వివరించిన ఆస్తులను లాంఛనప్రాయ/ భౌతిక స్వాధీనంచేసుకొన్నారు.
ప్రత్యేకించి రుణగ్రహీత/ తాకట్టుదారు/ హామీదారు మరియు సర్వజనులను ఇందుమూలంగా హెచ్చరించడమేమనగా, ఆస్తులతో లావాదేవీలు జరుపరాదని మరియు ఆస్తులతో లావాదేవీలు జరుపుట అనునది, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రకు పై పేర్కొన్న మొత్తాలను చెల్లించుటకులోబడి ఉంటుంది.
సెక్యూర్డ్ అసెట్స్‌ను విడిపించుకొనుటకు, అందుబాటులోగల సమయంకు సంబంధించి, చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ 8 యొక్క నియమాలపై రుణగ్రహీత శ్రద్ధవహించవలసిందిగా కోరబడుచున్నది.
సెక్యూరిటీ వివరాలు: చార్జ్ స్వభావం: ఎ) **ప్రైమరీ:** స్టాక్& డెట్ పుస్తకాల హైపోతికేషన్ **బి) కొల్లెటెరల్: ఆస్తి యొక్క ఈక్విటేబుల్ తాకట్టు**
తాకట్టుపెట్టిన ఆస్తి వివరణ: ఎన్‌టిఆర్ జిల్లా, ఎస్ఆర్ఒ పటమట, విజయవాడ పరిధిలో 591.50చ.గ.లు, వార్డు నం.29, రెవెన్యూ వార్డు నం.11, బ్లాక్ నం.4, కృష్ణా నగర్, సత్యనారాయణ వీధి, అసెస్మెంట్ నం. 1073109544, డోర్ నం.40-3/1-54, ఎన్‌టిఎస్ నం.100 వద్దగలది.
ఎన్‌టిఆర్ జిల్లా, విజయవాడ, పటమట సబ్-రిజిస్ట్రీ, విజయవాడ, లబ్బీపేట్, కృష్ణా నగర్ వద్దగల తగిన అసెస్మెంట్ నం. 26122ఎం, ప్రస్తుత అసెస్మెంట్ నం. 1073109544, పాత అసెస్మెంట్ నం. 13191, 9172, 6840, మున్సిపల్ వార్డు నం.29, ఎన్‌టిఎస్ నం.100, బ్లాక్ నం.4, రెవెన్యూ వార్డు నం.11 లో గ్రౌండ్, మొదటి& రెండవ అంతస్తులుతో ఆర్‌సిసి నివాస భవనముతో 591 1/2 చ.గ.లు లేదా 494-674చ.మీ.ల విస్తీర్ణపు సైటు. సరిహద్దులు: ఉత్తరం వైపు: శ్రీ డి ఎల్ కృష్ణమూర్తి ఆస్తి, తూర్పు వైపు: శ్రీ ఎ. సీతారామయ్య & ఇతరుల ఆస్తి., పడమర వైపు: మున్సిపల్ రోడ్, దక్షిణం వైపు: మున్సిపల్ రోడ్.
"ఈ స్వాధీనతా ప్రకటన జారీచేయుట ద్వారా మా ఇటీవలి స్వాధీనతా ప్రకటనలలో ఇచ్చిన అంశాలకు అనుబంధంగా జారీచేస్తున్నాము"
తేది: 07.06.2024 (సం/-) చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి,
ప్రదేశం: విజయవాడ విజయవాడ జోన్, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర.

దోస్త్ తొలివిడతలో 76,720 మందికి సీట్ల కేటాయింపు

- ఇంగ్లీష్ మాధ్యమంలో 72,431 మంది ప్రవేశం
- కామర్స్‌లో 28,655 మందికి కేటాయింపు
- 12 వరకు సెల్ఫ్ రిపోర్టింగ్ గడువు
- 70 కాలేజీల్లో జీరో అడ్మిషన్లు
- బుర్రా వెంకటేశం, లింబాద్రి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో బిఎ, బిఎస్సి, బికాం, బికాం ఒకేషనల్, బికాం ఆనర్స్, బిఎస్‌డబ్ల్యూ, బిబిఎ, బిసిఎ, బిబిఎం, బిసిఎ కోర్సుల్లో 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్)కు సంబంధించి తొలి విడత సీట్లను విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం, ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆర్ లింబాద్రి కేటాయించారు. గురువారం హైదరాబాద్‌లోని ఉన్నత విద్యామండలి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ దోస్త్ తొలివిడతలో 1,04,784 మంది నమోదు చేసుకున్నారని వివరించారు. వారిలో 81,769 మంది వెబ్‌ఆప్షన్లు నమోదు చేశారని చెప్పారు. 76,290 మందికి సీట్లు కేటాయించామన్నారు. తక్కువ వెబ్‌ఆప్షన్లను నమోదు చేసిన 5,479 మందికి సీట్లు కేటాయించలేదని వివరించారు. మొదటి ప్రాధాన్యత ద్వారా 55,124 మంది, రెండు, ఇతర ప్రాధాన్యత ద్వారా 21,166 మంది అభ్యర్థులు సీట్లు పొందారని చెప్పారు. 28,423 (37.26 శాతం) మంది అబ్బాయిలు, 47,867 (62.74 శాతం) మంది అమ్మాయిలు సీట్లు పొందిన వారిలో ఉన్నారని అన్నారు. ఇంగ్లీష్ మాధ్యమంలోనే 72,431 మంది సీట్లు పొందారని అన్నారు. తెలుగు మాధ్యమంలో 3,314 మంది, హిందీ మాధ్యమంలో ఐదుగురు, ఉర్దూ మాధ్యమంలో 540 మందికి సీట్లు కేటాయించామన్నారు. ఆర్ట్స్‌లో 7,766 (10.18 శాతం) మంది, కామర్స్‌లో 28,655 (37.56 శాతం) మంది, లైఫ్ సైన్సెస్‌లో 15,301 (20.06 శాతం) మంది, ఫిజికల్ సైన్సెస్‌లో 14,964 (19.61 శాతం) మంది, డేటా సైన్స్ ఏఐఅండ్ ఎంఎల్‌లో 2,502 (3.28 శాతం) మంది, డీ ఫార్మసీలో 90 (0.12 శాతం) మంది, ఇతర కోర్సుల్లో 7,012 (9.19 శాతం) మందికి సీట్లు కేటాయించామని వివరించారు. దోస్త్ పరిధిలో 886 కాలేజీల్లో 3,84,748 సీట్లున్నాయని చెప్పారు. తొలివిడతలో 76,290 మందికి సీట్లు కేటాయించామని అన్నారు. డిగ్రీ కాలేజీల్లో ఇంకా 3,08,458 సీట్లు మిగిలాయని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 70 కాలేజీల్లో జీరో అడ్మిషన్లు నమోదయ్యాయని వివరించారు. సీట్లు పొందిన అభ్యర్థులు దోస్త్ వెబ్‌సైట్ ద్వారా రూ.500 లేదా రూ.వెయ్యి చెల్లించి శుక్రవారం నుంచి ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని సూచించారు. సెల్ఫ్ రిపోర్టింగ్ గడువు ఈనెల 12 వరకు ఉందని చెప్పారు. ప్రభుత్వ, విశ్వవిద్యాలయ కాలేజీల్లో సీట్లు పొందిన వారు ఈపాస్ ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం అర్హత పొందిన విద్యార్థులు సీటును రిజర్వ్ చేసుకునేందుకు ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్ కోసం ఎలాంటి రుసుమును చెల్లించాల్సిన అవసరం లేదని అన్నారు. సెల్ఫ్ రిపోర్టింగ్ చేయని అభ్యర్థులు సీట్లు కోల్పోతారనీ, దోస్త్ రిజిస్ట్రేషన్ రద్దవుతుందని స్పష్టం చేశారు. దోస్త్ తొలివిడత, రెండో విడత, మూడో విడతలో సీట్లు పొందిన అభ్యర్థులు ఈనెల 29 నుంచి వచ్చేనెల ఐదో తేదీ వరకు కేటాయించిన కాలేజీల్లో రిపోర్టు చేయాలని వివరించారు. రిపోర్టు చేయకుంటే ఆ సీటు రద్దవుతుందని చెప్పారు. దోస్త్ రెండో విడత రిజిస్ట్రేషన్, వెబ్‌ఆప్షన్ల నమోదు ప్రక్రియ గురువారం నుంచి ప్రారంభమైందన్నారు. అందుకోసం తుది గడువు ఈనెల 14 వరకు ఉందని అన్నారు. ఈనెల 18న సీట్లు కేటాయిస్తామని చెప్పారు.

జేఎన్టీయూలోనూ పార్ట్‌టైం బీటెక్ : బుర్రా వెంకటేశం

జెఎన్‌టియు హైదరాబాద్‌లోనూ పార్ట్‌టైం బీటెక్‌లో చేరేందుకు అవకాశముందని బుర్రా వెంకటేశం అన్నారు. ఈసెట్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు అందులో చేరేందుకు అర్హులని వివరించారు. పాలిటెక్నిక్ కాలేజీల్లో ఉన్న కోర్సులు అందుబాటులో ఉంటాయని చెప్పారు. ఇప్పటికే ఒయులో ఉన్న ఈ విధానాన్ని జెఎన్‌టియుహెచ్‌లోనూ అమలు చేస్తున్నామని అన్నారు.

99.40 శాతం టాప్ మార్కులతో అలేఖ్యకు మహిళా వర్సిటీలో సీటు

ఇంటర్‌లో 99.40 శాతం టాప్ మార్కులతో తమ్మ అలేఖ్య తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయంలో లైఫ్ సైన్స్‌లో సీటు పొందారని బుర్రా వెంకటేశం, లింబాద్రి చెప్పారు. 99.30 శాతం మార్కులతో కడం అంకిత, బానోతు అంజలి ఫిజికల్ సైన్స్‌లో, 99.20 శాతం మార్కులతో మునావర్ ఫాతిమా లైఫ్ సైన్స్‌లో, అవే మార్కులతో గునుగుంట్ల నమ్రత ఫిజికల్ సైన్స్‌లో, నూకల శివశంకర్, కొర్రా కౌసల్య ఆర్ట్స్‌లో సీట్లు పొందారని వివరించారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ఎస్‌కే మహమూద్, కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్, కళాశాల విద్యాశాఖ జెడిలు జి యాదగిరి, రాజేందర్‌సింగ్, ఏజీవో పి బాలభాస్కర్, దోస్త్ అకడమిక్ కోఆర్డినేటర్ సౌందర్య జోసెఫ్, టెక్నికల్ కోఆర్డినేటర్ యమునారాణి, సిజిజి ఎడి గజేంద్రబాబు, దోస్త్ అడ్మిషన్ల కోఆర్డినేటర్ డి వసుంధర, హెల్ప్‌డెస్క్ కోఆర్డినేటర్ ఎం విజయరెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ సిహెచ్ కిషోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్యాల వారీగా దోస్త్ సీట్ల కేటాయింపు

యాజమాన్యం	కాలేజీలు	సీట్ల సంఖ్య	కేటాయింపు
ప్రభుత్వ కాలేజీలు	126	53,760	12,094
ప్రభుత్వ (అటానమస్)	22	27,780	16,521
యూనివర్సిటీ (అటానమస్)	2	2,907	2,082
యూనివర్సిటీ కాలేజీలు	4	3,480	3,342
రైల్వే కాలేజీ	1	131	131
ఎయిడెడ్	26	11,010	4,086
ఎయిడెడ్ (అటానమస్)	3	1,320	913
ప్రయివేటు కాలేజీలు	699	2,80,240	35,574
ప్రయివేటు (అటానమస్)	3	4,120	1,547
మొత్తం	886	3,84,748	76,290

కొత్త క్రిమినల్ లాపై పోలీసులు అవగాహన పెంచుకోవాలి

- డిజిపి రవి గుప్తా

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

వచ్చే నెల నుంచి అమలు కాబోతున్న కొత్త క్రిమినల్ లాపై ప్రతి పోలీసులు అవగాహన పెంచుకోవాలనీ, ఆ దిశగా ఐపిఎస్ అధికారులు సక్రమంగా పర్యవేక్షణ చేయాలని రాష్ట్ర డిజిపి డాక్టర్ రవి గుప్తా కోరారు. గురువారం హైదరాబాద్‌లోని రాజా బహదూర్ వెంకటరామిరెడ్డి తెలంగాణ పోలీసు అకాడమీ (టిజిపిఎ)లో ఐపిఎస్ అధికారులకు కొత్త క్రిమినల్ లాపై నిర్వహించిన వర్క్‌షాపునకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. జూలై ఒకటో తేదీ నుంచి దేశ వ్యాప్తంగా కొత్త క్రిమినల్ లా అమలు కాబోతున్నదనీ, ఈ చట్టాలపై సరైన అవగాహన కల్పించుకున్నప్పుడే ప్రజలకు తగిన విధంగా సేవలు పోలీసు శాఖ నుంచి అందగలవని డిజిపి అభిప్రాయపడ్డారు. పాతచట్టాల స్థానంలో కొత్త న్యాయ సూత్రాలు అమల్లోకి రావడం దేశ కాలానుగుణమైన మార్పులకు అవసరంగా ఎంతో ఉపయోగకరమని ఆయన చెప్పారు. ఈ విషయంలో డిజిపి స్థాయి నుంచి కిందిస్థాయి కానిస్టేబుల్ వరకు ప్రతి ఒక్కరూ కొత్త చట్టం పట్ల అవగాహన పెంచుకోవడం వల్ల సమాజంలో న్యాయవంచితులకు సరైన మార్గనిర్దేశం చేయగలుగుతామన్నారు. ఈ సందర్భంగా కొత్త క్రిమినల్ చట్టాలపై టిజిపిఎ రూపొందించిన పుస్తకాలను ఆయన ఆవిష్కరించారు. ఈ వర్క్‌షాపులో కొత్త చట్టంలోని అంశాలపై నల్సార్ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్లు ఐపిఎస్ అధికారులకు అవగాహనను కల్పిస్తూ ప్రసంగించారు. అనంతరం ఐపిఎస్ అధికారులను గ్రూపులుగా విడదీసి వాటిపై చర్చలు జరిపి సందేహాలను కూడా అధికారులకు ప్రొఫెసర్లు నివృత్తి చేశారు. కార్యక్రమంలో టిజిపిఎ డైరెక్టర్ అభిలాషబిస్త్, రాష్ట్ర హోం శాఖ ముఖ్య కార్యదర్శి జితేందర్, రాష్ట్ర శాంతిభద్రతల అదనపు డిజి సంజయ్‌కుమార్ జైన్, మూడు నగరాల కమిషనర్లు శ్రీనివాస్‌రెడ్డి, అవినాశ్ మహంతి, తరుణ్‌జోషితోపాటు ఇంటలిజెన్స్ అదనపు డిజి శివధర్‌రెడ్డితోపాటు పలు జిల్లాల ఎస్‌పిలు, రేంజ్ ఐజిలు, డిఐజిలు, ఇతర సీనియర్ పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ఎపిఎల్ అపోలోకు అక్షయ్ కుమార్ కొత్త ప్రచారం

హైదరాబాద్ : ప్రముఖ బ్రాండెడ్ స్టీల్ షీట్స్ తయారీదారు ఎపిఎల్ అపోలో స్టీల్ ట్యూబ్స్ లిమిటెడ్ బాలీవుడ్ సూపర్ స్టార్ అక్షయ్ కుమార్ నటించిన కొత్త టివి ప్రకటనను ప్రారంభించినట్లు ఆ సంస్థ తెలిపింది. వినూత్న ఉత్పత్తి రూఫ్ టఫ్-కలర్ కోటెడ్ కాయిల్స్‌లు ప్రదర్శించినట్లు ఎపిఎల్ అపోలో ట్యూబ్స్ లిమిటెడ్ సిఎండి సంజయ్ గుప్తా తెలిపారు. తాము సృజనాత్మకత, అత్యున్నత నాణ్యత కలిగిన ఉత్పత్తులను అందించడానికి కట్టుబడి ఉన్నామన్నారు.

వేగంగా బ్యారేజీల మరమ్మతులు

- జులైలోగా పూర్తయ్యే అవకాశం
- ఈసారీ తొందరగా వరదలు
- నేడు మంత్రి ఉత్తమ్ పర్యటన
- మేడిగడ్డతోనే తంట
- యంత్రాల కొరతతో ఆలస్యం
- ఆందోళనలో అధికారులు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాళేశ్వరం ప్రాజెక్టులోని బ్యారేజీల మరమ్మతులను యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయి. రాష్ట సాగునీటి, పారుదల శాఖ పర్యవేక్షణలో వర్కింగ్ ఏజెన్సీ లార్సన్ అండ్ టూబ్రో (ఎల్‌అండ్‌టి) వేగంగా చేస్తోంది. ప్రాజెక్టులోని మేడిగడ్డతోపాటు అన్నారం, సుందిళ్లల్లో మరమ్మతుల పనులు చోటుచేసుకుంటున్నాయి. అలాగే అటు కేంద్రం, ఇటు రాష్ట్రం నుంచి అధికారులు, నిపుణుల కమిటీలు, ఆయా సంస్థలు నిత్యం బ్యారేజీలను సందర్శిస్తూ పరీక్షలు చేస్తున్నాయి. ఒకవైపు మరమ్మతుల పనులు జరుగుతుండగా, మరోవైపు పరీక్షలు నిర్వహిస్తుండటం గమనార్హం. పనులు గాడిన పడినట్టేనని ఇంజినీర్ ఇన్ చీఫ్ బి అనిల్‌కుమార్ చెప్పారు. ఇదిలావుండగా కాళేశ్వరం విచారణ కోసం నియమించిన జ్యుడీషియల్ కమిషన్ చైర్మన్ పిసి ఘోష్ ఆదివారం నుంచి హైదరాబాద్‌లో ఉండి విచారణ ప్రక్రియను వేగవంతం చేయనున్నారు. ఈ నెలాఖరులోగా సర్కారుకు నివేదిక ఇవ్వాల్సి ఉన్న నేపథ్యంలో జస్టిస్ ఘోష్ ఆయా సంస్థలు ఇచ్చిన నివేదికలు, ఇతర అంశాలను ఇప్పటికే పూర్తిస్థాయిలో అధ్యయనం చేసినట్టు తెలిసింది. అలాగే ఇప్పటికే మేడిగడ్డ బ్యారేజీని సందరించిన జస్టిస్ ఘోష్, శుక్రవారం అన్నారం బ్యారేజీని, శనివారం సుందిళ్ల బ్యారేజీని స్వయంగా పరిశీలించనున్నారు. అలాగే సాగునీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సైతం శుక్రవారం మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పనుల పరిశీలన కోసం వెళుతున్నారు. సాధారణ ఎన్నికల కోడ్ గురువారం కేంద్ర ఎన్నికల సంఘం ఎత్తేయడంతో చేస్తున్న తొలి పర్యటన ఇదే.

జులైలోగా తాత్కాలిక మరమ్మతులు

బ్యారేజీలకు జరుగుతున్న వివిధ తాత్కాలిక మరమ్మతుల పనులు జులైలోగా పూర్తికావచ్చని అధికారులు అంటున్నారు. శాశ్వత మరమ్మతుల పనులు చేయడానికి డిసెంబరు వరకు సమయం పట్టొచ్చనేది వారి అభిప్రాయం. అన్నారం, సుందిళ్లలో సులభంగానే పనులు పూర్తయ్యే అవకాశం ఉందని సాగునటిపారుదల ఇంజనీర్లు చెబుతున్నారు. కేవలం మేడిగడ్డలోనే సమస్యలు ఉన్నాయని అంటున్నారు. ఆ బ్యారేజీ పగుళ్లు తీవ్రంగా ఉండటం, గేట్లు మొరాయిస్తుండటంతో సమయం ఎక్కువ పడుతోందనే చెబుతున్నారు. గురువారం మేడిగడ్డ బ్యారేజీలోని ఏడో బ్లాక్‌లోని 16 , 17 నంబరు గేట్లను విజయవంతంగా ఎత్తేశారు. మిగిలిన 18, 19, 20, 21 గేట్లను ఇంకా ఎత్తాల్సి ఉందని, వాటి పనులు సాగుతున్నాయని ఇంజనీర్ ఇన్ చీఫ్ బి అనిల్‌కుమార్ అంటున్నారు. ఈ పనులు చేయడానికి కావాల్సిన యంత్రాల కొరత వర్కింగ్ ఏజెన్సీని వేధిస్తున్నదని తెలిసింది. వాటిని సమకూర్చుకునే ప్రయత్నాల్లో ఎల్‌అండ్‌టి ఉంది. అవి త్వరలోనే అందుబాటులోకి రావొచ్చు. ఇందుకోసం దేశీయ సంస్థలతో సంప్రదిస్తున్నట్టు సమాచారం. అలాగే విదేశాల నుంచి వేగంగా తెప్పించుకునే అవకాశాలనూ పరిశీలిస్తున్నారు. యంత్రాలు రాగానే రాత్రింభవళ్లు పనులు చేసేందుకు ప్రణాళిక ముందుగానే సిద్ధం చేసినట్టు అధికారులు అంటున్నారు. ఈ మేరకు ఎల్‌అండ్‌టి సమాయత్తమైందని చెబుతున్నారు. అయితే ఈవిషయంలో అధికారులు కొంత ఆందోళనగానే కనిపిస్తున్నారు.

ఈసారీ తొందరగానే వరద

సాధారణంగా వర్షాలు మృగశిర కార్తెలో వస్తాయి. కాకపోతే ఈసారీ ముందే వానలు పలకరించాయి. ఎల్‌నినో, లానినో ప్రభావంతో వర్షాలు ఇప్పటికే ప్రారంభమైన సంగతి తెలిసిందే. ప్రాణహిత నదిలో ఇప్పటికే కొంత ప్రారంభమైంది. గోదావరి నదికి జులైలో వరదలు వస్తాయని సాగునీటిపారుదల శాఖ చెబుతోంది. ఈ తరుణంలో కాళేశ్వరం బ్యారేజీల మరమ్మతులు వేగంగా చేపట్టాల్సి ఉంటుంది. ఈ మేరకు వర్కింగ్ ఏజెన్సీకి సాగునీటి శాఖ అధికారులు పనుల షెడ్యూల్‌ను ఇచ్చినట్టు తెలిసింది. ఎప్పటిలోగా ఏయే పనులు జరగాలి, నాణ్యత, ఇతర సమస్యలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుందనే విషయాలపై ఎప్పటికప్పుడు స్థానికంగా ఉండే సైట్ ఇంజనీర్లు పర్యవేక్షిస్తున్నారు.

మరమ్మతుల ఖర్చెంత ?

కాళేశ్వరంలోని బ్యారేజీల మరమ్మతు పనులకు ఎంత ఖర్చవుతుందనే అంచనాలు బయటకు పొక్కనీయడం లేదు. అటు ఎల్‌అండ్‌టి గానీ, ఇటు సాగునీటిపారుదల శాఖ గానీ నోరు మెదపడం లేదు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణం మొత్తం సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)లో రూ.10 వేల కోట్లుగా పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులు జ్యుడిషియల్ కమిషన్‌కు సైతం నివేదించారు. ఇప్పుడు గేట్లు, ఇతర పనులు కోసం ఎంత ఖర్చు పెడుతున్నారనే సంగతి రహస్యంగా ఉంది. ఈవిషయపై అధికారులను అడిగితే 'అది మాకు సంబంధం లేదు..అది వర్కింగ్ ఏజెన్సీ చూసుకుంటుంది..ఒప్పంధంలో భాగంగా మరమ్మతుల ఖర్చు ఆ సంస్థ భరించాల్సిందే. పనులు షెడ్యూల్ ప్రకారం జరుగుతున్నాయా? లేదా?, నాణ్యత ఇతర అంశాలను మేము ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ సాధ్యమైనంత తొందరగా పనులు పూర్తిచేసేందుకు ప్రయత్నిస్తున్నామని' అధికారులు చెబుతున్నారు. సాంకేతికంగా కూడా భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు సమాచారం.

హరీశ్‌రావుపై ఆరోపణలు నిరాధారం

- బిఆర్ఎస్ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

సిద్ధిపేటలో మాజీ మంత్రి హరీశ్‌రావు తమ పార్టీ ఓట్లను బిజెపికి బదిలీ చేయించారంటూ సిఎం రేవంత్ రెడ్డి చేసిన ఆరోపణలు నిరాధారమైనవని బిఆర్ఎస్ నేత డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్ కొట్టిపారేశారు. ముఖ్యమంత్రి సొంత గ్రామం కొండారెడ్డిపల్లిలో బిజెపికి ఆధిక్యత వచ్చిందని, మరి ఆ ఓట్లు రేవంత్ రెడ్డి బదిలీ చేయించినట్టా? అని ఆయన ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికల్లో సీఎం గెలిచిన కొడంగల్ అసెంబ్లీ నియోజకవర్గంలో 30 వేలకు పైగా మెజారిటీ తెచ్చుకున్నారనీ, అదే నియోజకవర్గంలో ఎంపి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 22 వేలకు పడిపోయాయని గుర్తు చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చినట్టే మెజారిటీ వస్తే మహబూబ్‌నగర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి గెలిచేవారని తెలిపారు. రేవంత్‌రెడ్డి ఓట్లను బదిలీ చేసి బిజెపి అభ్యర్థి డి.కె.అరుణను గెలిపించారని ఆయన ఆరోపించారు. బిఆర్ఎస్‌ను విమర్శించడం మానుకుని ఆరు నెలల పాలనలోనే 8 ఎంపి సీట్లకే కాంగ్రెస్ పరిమితమయిందో సమీక్షించుకోవాలని సూచించారు.

పర్యావరణ అనుకూల బల్క్ రవాణాకు రైల్వేలు సాధనం

- రైల్వే బోర్డు చైర్‌పర్సన్ జయవర్మసిన్హా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భారతీయ రైల్వేలు పర్యావరణ అనుకూల బల్క్ రవాణాకు ఒక సాధనాలని రైల్వే బోర్డు చైర్‌పర్సన్ జయవర్మ సిన్హా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఏడాది జరుపుకునే ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా'మన భూమి, మన భవిష్యత్' నినాదంతో బుధవారం సికింద్రాబాద్‌లో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిన్హా మాట్లాడుతూ కాలుష్యం, కార్బన్ ఉద్గారాలను తగ్గించడం, వనరులు, ఇంధన సామర్థ్యాన్ని ప్రోత్సహించడం, సుస్థిరతకు దోహదం చేయడం ద్వారా పర్యావరణంపై సానుకూల ప్రభావాన్ని చూపే నిరంతర కార్యక్రమాలను రైల్వేలు చేపడుతున్నదని తెలిపారు. కార్యక్రమంలో రైల్వే బోర్డు ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

సిఎంను కలిసిన కొత్త ఎంపిలు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధించిన కాంగ్రెస్ ఎంపిలు... ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో పెద్దపల్లి ఎంపి గడ్డం వంశీకృష్ణ, మహబూబాబాద్ ఎంపి బలరాంనాయక్ కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వారిని అభినందించారు. సిఎంను కలిసిన వారిలో ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి ఉన్నారు.

నేటి నుంచి ప్రజావాణి పునఃప్రారంభం

- ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ చిన్నారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

లోక్ సభ ఎన్నికల కోడ్ ముగిసిన నేపథ్యంలో శుక్రవారం నుంచి ప్రజావాణి కార్యక్రమాన్ని తిరిగి ప్రారంభిస్తామని ప్రజావాణి ఇన్‌చార్జీ, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి చిన్నారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం వరకు దేశ వ్యాప్తంగా లోక్‌సభ ఎన్నికల మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఉన్నందున ప్రజావాణి అర్జీల కార్యక్రమం తాత్కాలికంగా వాయిదా పడిందని పేర్కొన్నారు.

ఇద్దరు యువకుల దారుణ హత్య

- రంగారెడ్డి జిల్లా కడ్తాల్‌లో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇద్దరు యువకులు దారుణహత్యకు గురైన ఘటన రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండల కేంద్రం సమీపంలోని ఫార్చ్యూన్ బటర్ ఫ్లై సిటీలో జరిగింది. కడ్తాల్ సీఐ శివప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. కడ్తాల్ మండలంలోని గోవిందాయిపల్లి గ్రామానికి చెందిన జలకం రవి కడ్తాల్ సమీపంలో ఫార్చ్యూన్ బటర్ ఫ్లై సిటీలోని 3/4/5 విల్లాలను బుధవారం రాత్రి అద్దెకు తీసుకున్నాడు. జంగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన రాజుగౌడ్, మరికొంత మందిని అక్కడికి పిలిపించుకున్నారు. వీరితో పాటు గోవిందాయిపల్లి గ్రామానికి చెందిన శేషుగారి శివ (27), గుండెమోని శివ (25)నూ అక్కడికి పిలిపించారు. కాగా, విల్లాలో రాత్రి వీరి మధ్య గొడవ జరగడంతో శేషుగారి శివ, గుండెమోని శివను నిందితులు అతి కిరాతకంగా చంపి అక్కడి నుంచి పారిపోయారు. గురువారం ఉదయం మృతుల కుటుంబ సభ్యులు, స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. శంషాబాద్ అడిషనల్ డిసిపి రామ్‌కుమార్, షాద్‌నగర్ ఎసిపి రంగస్వామి, కడ్తాల్ ఆమనగల్ సీఐలు శివప్రసాద్, ప్రమోద్‌కుమార్, ఎస్ఐలు వరప్రసాద్, బాల్ రామ్.. ఘటనా స్థలాన్ని సందర్శించి వివరాలు సేకరించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే హత్యకు గల కారణాలు తెలియాల్సి ఉందని సిఐ తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మృతుల కుటుంబాల ఆందోళన

బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని వారి బంధువులు, గ్రామస్తులు పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టారు. హత్యకు కారకులైన వారిని చట్టపరంగా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలకు తగిన న్యాయం చేస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో వారు తమ ఆందోళన విరమించారు. హత్యకు గురైన శేషుగారి శివ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తుండగా.. గుండెమోని శివ చికెన్ షాప్‌లో పనిచేస్తుండే వాడని స్థానికులు తెలిపారు.

గుప్తనిధి పేరిట రూ.80 వేల టోకరా

- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన
- ముఠాను పట్టుకున్న పోలీసులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గుప్త నిధుల పేరిట రూ.80 వేల టోకరా వేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అమాయకులకు నిధుల ఆశ చూపి మంత్రాలు, చేతబడులు చేస్తామని నమ్మబలికిన ముఠాను ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ (టి) మండల పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ దికొండ రమేష్ గురువారం వివరాలు వెల్లడించారు.

కౌటాల మండలానికి చెందిన మీసాల బాపురావు తనకు దేవరా వస్తుందని, ఎవరికైనా ఆరోగ్యం బాగాలేకపోతే భూత వైద్యం చేసి నయం చేయడంతోపాటు గుప్తనిధుల తవ్వకాలు చేస్తానని మండలానికి చెందిన జోజప్పకు పరిచయం చేసుకున్నాడు. సిర్పూర్-టి డౌనల్ ఏరియాలోని మీ మామ ఇంట్లో గుప్తనిధి ఉందని జోజప్పకు చెప్పాడు. అతని మాటలు నమ్మిన జోజప్ప మామ ఇంట్లో ఉన్న నిధిని తీసేందుకు ఒప్పుకున్నాడు. నిధిని బయటకు తీయాలంటే పూజలు చేయాలని, పూజ సామాగ్రి కొనుగోలు చేయడానికి రూ.80 వేలు కావాలన్నాడు. దీంతో జోజప్ప ఆ డబ్బులను బాపురావుకు ఇచ్చాడు. గత సంవత్సరం డిసెంబర్ 4న బాపురావుతో పాటు చింతకుంట గ్రామానికి చెందిన మరో ఇద్దరు లవుడ్యా శ్రీధర్, అజ్మీర ప్రసాద్‌తో కలిసి ఇంటికొచ్చి అర్ధరాత్రి పూజలు చేశారు. ఇంట్లో తవ్వుతున్న సమయంలో జోజప్పను బయట ఉండాలని చెప్పారు. ఆ తర్వాత కొద్దిసేపటికి మళ్లీ లోపలకు పిలిచి తవ్వుతుండగా మట్టి నుంచి మూట ఒకటి బయట పడిందని, అందులో నిధి ఉందని, దానిని ఎవరూ చూడకూడదు.. విప్పకూడదని చూస్తే చనిపోతారని చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోయారు. రెండు నెలల తర్వాత బాపురావు చింతకుంట గ్రామంలోని ఓ మహిళ ఇంటికి వైద్యం చేయడానికి వచ్చాడు. మీ ఇంట్లో గుప్తనిధి ఉందని నమ్మించి పూజలు చేసి తవ్వకాలు మొదలు పెట్టారు. ఆమెను కూడా కొద్దిసేపు బయట ఉండమని చెప్పి తమ వెంట తెచ్చిన నకిలీ బంగారు బిస్కెట్‌ను ఒక గంజులో పెట్టి బట్టకట్టి పూడ్చిపెట్టారు. తర్వాత ఆమెను లోపలికి పిలిచి మట్టిని తొలగించి బట్టకట్టిన గంజును బయటకు తీశారు. అర కేజీ బంగారం బిస్కెట్ లభ్యమైనట్టు చెప్పారు.

ఈ క్రమంలో తాను మోసపోయినట్టు తెలుసుకున్న జోజప్ప తన రూ.80 వేలు ఇవ్వాలని బాపురావును అడగ్గా.. డబ్బులు ఇచ్చేవరకు బంగారం బిస్కెట్‌ను దగ్గర ఉంచుకోవాలని ఇచ్చాడు. దాన్ని తీసుకెళ్లి అతను పరీక్షించగా.. నకిలీదని తేలింది. దాంతో జోజప్ప పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో విషయం బయటపడింది. విచారణ చేపట్టిన పోలీసులు ఆ దొంగ ముఠాను పట్టుకొని రిమాండ్‌కు తరలించారు. గుప్తనిధుల పేరుతో మళ్లీ ఎవరైనా వచ్చి మాయమాటలు చెబితే నమ్మొద్దని ఎస్ఐ ప్రజలకు సూచించారు. అలాంటివి వారు ఎక్కడైనా కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న చేవెళ్ల ఎంపి

కెసిఆర్ పాలన కంటే రేవంత్ పాలనే నయం

- రాజకీయాలను పక్కనబెట్టి రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేస్తా
- చేవెళ్ల ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్ర మంత్రి అయ్యే అర్హతలు తనకున్నాయని, మంత్రి అయితే కొన్ని సానుకూలతలు, ప్రతికూలతలుంటాయని చేవెళ్ల ఎంపి, బిజెపి నేత కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. అంతిమంగా పార్టీ ఏ నిర్ణయం తీసుకున్నా దానికి కట్టుబడి ఉంటానని చెప్పారు. చేవెళ్ల నియోజకవర్గంలో బిఆర్ఎస్ వాళ్లే కాదు కాంగ్రెసోళ్లు కూడా తనకు ఓటేసి ఆదరించారనీ, అందుకే ఇంత పెద్ద మెజార్టీ వచ్చిందని తెలిపారు. గత కెసిఆర్ ప్రభుత్వం కంటే రేవంత్‌రెడ్డి సర్కార్ నయమని కితాబిచ్చారు. కెసిఆర్ పాలనలో మాదిరిగా పోలీసులు వ్యవహరించలేదన్నారు. ఐదేళ్లు రాజకీయాలను పక్కకు బెట్టి రాష్ట్ర ప్రభుత్వంలో కలిసి పనిచేస్తామనీ, కేంద్రం నుంచి తన వంతుగా సహకారాన్ని అందిస్తానని చెప్పారు.

గత ప్రభుత్వం చేసిన అప్పులు రాష్ట్ర ప్రభుత్వ మెడకు తగులుకున్నాయన్నారు. ఎంపి అయ్యాక ఆయన తొలిసారి హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయానికి గురువారం వచ్చారు. ఈ సందర్భంగా ఆయన్ను బిజెపి రాష్ట్ర నాయకులు జంగయ్య యాదవ్ సత్కరించారు. కేంద్రం సపోర్టుతో తెలంగాణ అభివృద్ధి మరింత ముందుకు పోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. శంకర్‌పల్లి, వికారాబాద్ వరకు ఎంఎంటిఎస్ విస్తరణకు కృషి చేస్తానని, 400 గ్రామాలకుపైగా ఎంపి ల్యాండ్స్ అందేలా చూస్తానని హామీనిచ్చారు. ఇండియాలో బెస్ట్ ఎంపిగా చేవెళ్ల నియోజకవర్గాన్ని అద్భుతంగా తీర్చిదిద్దుతానని నొక్కి చెప్పారు. మూడు నెలలు క్యాంపెయిన్, 400 టీమ్‌లతో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం తనకు ఉపయోగపడిందన్నారు. 700 గ్రామాల్లో సర్పంచులను గెలిపించేందుకు కృషి చేస్తానన్నారు. ఒకవేళ తాను కేంద్ర మంత్రి అయితే పది నెలలపాటు ఢిల్లీలో ఉండాల్సి వస్తుందని, కేవలం రెండు నెలలే తన నియోజకవర్గ ప్రజలతో ఉండే అవకాశం ఉంటుందని తెలిపారు. తనకు కొన్ని సబ్జెక్టులపై అపారమైన నాలెడ్జి ఉందనీ, మంత్రి అయితే దాన్ని దేశం ఉపయోగించుకునే వెసులుబాటు ఉంటుందని చెప్పారు. పార్లమెంట్ సమావేశాల్లోగానీ, కమిటీల మీటింగ్‌ల్లోగాని తాను వంద శాతం హాజరైన విషయాన్ని ప్రస్తావించారు. అయితే, అంతిమంగా పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటానని చెప్పారు.